

"అమ్మా. . . ఓ అమ్మా. . .ఓ అమ్మా. . . ఆకలవుతాంది. పలకవేం చే?"

పోలాయి గొంతు చించుకుని అరు పెట్టే బాధ్యత తనది కాదన్నట్లు గంజో పెట్టే తల్లి ఈ రోజా ఆకలి స్తున్నా రంగి ఆ పిలిచేది తనని కుండలు కడుక్కుంటూంది. ప్రతి అన్నా కిమ్మనకుండా ఊరుకుండేసరికి కాదన్నట్లు పలకలేదు. కొడుక్కి అన్నం రోజా ఆకలి అనకుండానే అన్నహో, పోలాయికి విసుగొచ్చి ముందున్న పలక్ని

సిల్వర్ పళ్ళెం విసురుగా తన్నాడు. చట్టిలమీద మూతలు తీసి చూశాడు. అన్నీ ఖాళీవే.

ఇదా సంగతి? ఇలాంటి స్థితి అప్పుడప్పుడూ తప్పదు వాళ్ళకి. ఓ విధంగా గంజినీళ్ళకూడా లేకుండా రెండేసి రోజులు గడపడటం అలవాటే అయినా, ఈ వేళ ఆకలి పేగులు తోడేస్తూంది. కాళ్ళు కడుపులో పెట్టుకుని కూర్చోనియటం లేదు. తను అడిగినదానికి ఉందో, లేదో అన్నైనా జవాబు చెప్పని తల్లిమీద చచ్చేంత కోపం వచ్చి దగ్గరే ఉన్న ఉప్పుపిడత విసిరి కొట్టాడు. అది కిందపడి ముక్కలు ముక్కలైంది. దానిలో అడుగున ఉన్న నాలుగు ఉప్పు రాళ్ళు ఇల్లంతా చెదిరి పడ్డాయి.

"చచ్చినోడా! ఇప్పటిదంకా తిరిగొచ్చి ఆకలంటే బూరెలూ పులగం ఎట్టేందుకు జమీందారింటో పుట్టాయేంటి? దొరబాబులా గొచ్చావు. ముప్పై పైసల ఉప్పుచట్టి నేలగొట్టావా. . . రానీ నీ బాబుకి సెప్తా!" రంగి దేక్కుంటూ వచ్చి నేలమీద పడ్డ ఉప్పు పోగుచేసి ఓ కాయితంలో కెత్తుకుంటూ కొడుకుని ఇంకా తిడుతూనే ఉంది.

"ఎదవబతుకు! ఈ ఇంటో పుట్టే కంటే సస్తే మేలు— కడుపు కింత గంజన్నా కరువేగందా!" విసురుగా గుడిసెలోంచి బయటికి వచ్చేశాడు పదేళ్ళ పోలాయి. వాడి కడుపు ఎప్పుడు చూసినా వెన్నుకి అంటుకునే ఉంటుంది. తలకి మూనె లేక తాటిపీచులా ఉంటుంది. ఒళ్ళంతా తాటిముట్టలా గరగరమంటూ ఉంటుంది. వాడి కళ్ళలో ఆకలి మాత్రం ప్రపంచాన్నంతటినీ ముట్టగా చుట్టి అప్పడంలా పరపరా నమిలి మింగేయాలనిపిస్తూన్నట్టుంటుంది.

వీడు పుట్టకముందు రంగి సంసార పరిస్థితి కాస్త బాగానే ఉండేది. పోలిగాడి తండ్రి వీరన్న కూలి పని కెడితే రంగి ఇంటిపని చక్కబెట్టుకుని కలవారి ఇళ్లలో పాచిపనులు చేసి మొగుడి సంపాదనకి కాస్త చప్పిళ్ళకి వేళ్ళన్నట్టు సాయపడేది. పోలిగాడు పుట్టిన రెండేళ్ళకి మరో కాన్పులో వాతం వచ్చి రెండు కాళ్ళూ పట్టుకుపోయాయి. ఎన్ని ఇంగ్లీషు మందులు వాడినా ప్రయోజనం లేకపోగా, వంద రూపాయల అప్పు మిగిలింది. రంగి ఇప్పుడు దేకుతూంది కానీ, నడవ లేదు.

ఒక్కగానొక్క బిడ్డ పోలిగాడంటే తల్లిదండ్రులకి కాస్త గారాబం. తల్లి మీద కోపం వచ్చి బయటికి వచ్చిన పోలిగాడు ఆకలి మరిచిపోవటానికి అలా అలా తిరుగుతూన్నాడు. ఓ సినిమా బండి కనిపిస్తే దాని వెంట కాస్సేపు పరుగెత్తాడు. నాలుగు కాయితాలు అందుకుని వాటిలోని బొమ్మలని పది నిమిషాలు చూశాడు. విసుగెత్తి ఆ కాయితాలు విసిరికొట్టాడు. కాస్సేపు దారిని పోయే చిన్న కార్లనీ, లారీలనీ, రిక్షాలనీ చూసి చూసి మెడ నెప్పి పెడుతూంటే చేతో నొక్కుకుంటూ ఉండగా ఏదో పెద్ద ఊరేగింపు సాగి వస్తూంటే ఆసక్తిగా దాన్ని చూసి, అందులో నడిచే అందరూ "జై ఇందిరా గాంధీకీ" అంటే తనూ అన్నాడు.

అదీ వెళ్ళిపోయింది. నడిచి నడిచి ఓ పసుపుపచ్చ బంగళా దగ్గరి కొచ్చాడు. చాలా పెద్ద బంగళాయేనే, దీంట్లో ఎన్ని గ[illegible]ంటాయో? దీంట్లో వాళ్ళెలాంటి తిండి తింటారో, ఎక్కడ పడుకుంటారో చూడాలనే కోరిక ఉంది. కానీ, ఎలా సాధ్యం? ఆ బంగళాకి కార్లు లోపలికీ, బయటికీ రావటానికి తెరిచే పెద్ద ఇనపగేటు గాక మరో చిన్న గేటు ఉంది. రకరకాల పువ్వులమొక్క లున్నాయి. టికీలకీ, దర్వాజాలకీ ముదురు నీలం పువ్వుల తెరలు గాలికి ఇటూ అటూ ఊగుతూన్నాయి. వరండాలో రకరకాల కుర్చీ లున్నాయి. కొన్ని పూవుల తొట్టెలు గమ్మత్తుగా వరండాలో దూలాలకి వేలాడుతూంటే విచిత్రంగా చూస్తూ నిలుచున్నాడు.

చిన్న గేటు దగ్గర నిలుచుని కాళ్ళు ఎత్తి కనిపించినంతవరకూ చుట్టూ చూస్తూ, తన చెయ్యి చాస్తే అందేంత దగ్గరగా ఓ ఎర్ర నుద్దమందార పువ్వు కనిపించి చెయ్యిచాచి అందుకోబోయాడు.

అంతవరకూ ఎక్కడ ఉన్నదో గుర్రంలా తెగబలిసిన కుక్క "భౌ భౌ" మంటూ మీదికొచ్చింది. ఇనపగేటే తీసి ఉంటే పోలిగాడి కండలు ఊడబెరికి రక్తం తాగేలా ఉంది దాని వాలకం చూస్తే.

ఆ కుక్కని చూస్తూనే హడిలిపోయి దూరంగా పారిపోయాడు. "జిన్నీ, కమాన్" అంటూంది వరండాలో నిలుచున్న ఓ పదేళ్ల అమ్మాయి.

ఆ పిలుపుకి కుక్క తోక ఆడిస్తూ వెళ్ళిపోయింది. పోలిగాడి కిది చిత్రాతి చిత్రంగా కనిపించింది. మెల్లగా మళ్లీ గేటు దగ్గరి కొచ్చాడు.

అప్పటికే ఆ పిల్ల లోపలికి వెళ్ళబోతూంది. లేతపచ్చ రంగు గౌనూ, ఎర్ర స్వెట్టరూ వేసుకుం దా పిల్ల. పోనీ— టెయిల్ కట్టుకుని చకచకా నడుస్తూంది. ఆ పిల్ల ముఖం సరిగా కనపడలేదు. ఆ ముఖం చూడాలనే కోరిక పోలిగాడిని నిలవనీయటం లేదు. ఎలా ఆ పిల్ల ముఖం చూడటం? తెగ ఆలోచించేసి మెరుపులాంటి ఆలోచన రాగానే ఉత్సాహంగా ఓ రాయి తీసుకుని గురి చూసి కుక్కకేసి కొట్టాడు.

కుక్క "భౌ భౌ" మంటూ తిరిగింది. ఆ అమ్మాయికూడా కోపంగా వెనక్కి తిరిగింది. ఈ సారి పోలిగాడు భయపడి పారిపోలేదు. గేటు మూసి ఉందిగా అనే ధైర్యంతో నిలబడ్డాడు. కుక్క అరుస్తూ గేటు దగ్గరికి పరుగెత్తు కొచ్చింది. దాని వెంట ఆ పిల్లకూడా వస్తూ కళ్ల జోడు తీసి మళ్ళీ పెట్టుకుని పోలాయి వైపు మింగేసేలా చూస్తూ, "ఏయ్! ఎవరు నువ్వు? ఎందుకొచ్చావ్" అంది.

నల్లగా చింతపండు రంగులో ఉం దా పిల్ల. పైగా, మెల్లకన్ను. అది కనపడ కుండా ఉండాలని కాబోలు కళ్లద్దాలు. ఈ రెండూ తప్పిస్తే పిల్ల బాగానే ఉందనిపిస్తూంది.

"ఇక్కడెందుకు నిలుచున్నావంటే మాట్లాడవేం?" మరీ గట్టిగా అడిగింది.

'ఇంత అందమైన మేడ, ఇమారమంత కారు, గుర్రంలా తెగబలిసిన కుక్క, తినటానికి బోలెడంత అన్నం— ఇన్నీ ఉన్నా ఈ పిల్ల నల్లగా ఉందేంటీ, ఆ మెల్లకన్నేంటీ' అని ఆలోచిస్తూన్నాడు. భాగ్యవంతు లందరూ అందంగా ఉండి తీరతారనీ, వాళ్లకి మంచి మనస్సులు ఉండి ఉంటాయనీ పోలిగాడి నమ్మకం. ఈ పిల్ల మెల్లకన్ను చూసేసరికి పోలిగాడికి నీరసం వచ్చింది. జవాబు చెప్పందే వదిలేలా లే దా పిల్ల.

"ఊ, నిన్ను సూడటానికే" అని అనబోయి వెనక్కి తీసుకుని, "మీ. . . మీ. . . కుక్కని సూట్టానికి" అని తడబడుతూనే అన్నాడు.

ఆ పిల్ల ముఖంలో చిరునవ్వు చిందింది.

**గోవిందరాజు సీతాదేవి**

"ఇది. . . దీని పేరు జిన్. బలే మంచిది. నే నంటే దీనికి చాలా ఇష్టం. బలే కుక్కపిల్ల. కదూ?"

నవ్వుతూనే అడిగింది. పోలిగాడి ఒళ్లంతా కితకితలు పెట్టినట్లైపోయింది. 'ఈ పిల్లకంటే నవ్వు కావా బాగుండాది' అనుకున్నాడు మనస్సులో. 'అయినా ఈ బాగెమంతులంతా పుణ్యం చేసుకున్నవాళ్లు. అందుకే బంగళాల్లో నివసిస్తూ, కోరినది తింటూ హాయిగా ఉన్నారు.'

పోలిగాడి కీ సంగతులన్నీ తల్లి చెప్పింది. అవే వాడి మనస్సులో బాగా ధ్రువపడిపోయాయి. తన ఇంటి చుట్టుపట్ల ఉన్న కూలిజనం బాతాఖానీ కొట్టేప్పు డిలాంటి మాట లెన్నో విన్నాడు.

ఎంత మెల్లకన్ను పిల్ల అయినా ఈ పిల్లని చూస్తే ఎందుకో చాలా సరదా వేస్తూంది పోలిగాడికి. కబుర్లు చెప్పాలనీ, స్నేహితంగా ఉండాలనీ అనిపిస్తూంది. ఆ పిల్ల ఒప్పుకోవద్దూ?

"ఏమిటీ చూస్తూన్నావు? కుక్కనంటూ నన్ను చూస్తూన్నావెందుకూ?"

జవాబేం చెప్పాలో తెలియక తల గోక్కున్నాడు, గేటుకి ఉన్న ఇనప ఊచలని పట్టుకుని.

"పో, వెళ్లిపో! నీలాం టాళ్లతో నే మాట్లాడితే మా అమ్మకి కోపం వస్తుంది. నీ భరతం పడుతుంది. అదిగో, వస్తోంది. వెళ్ళు."

"నిమ్మీ. . . ఏం చేస్తున్నావే. . . రా అమ్మా. . . అలాంటి వాళ్లతో మాట్లాడకూడదని చెప్పలే? దొంగ వెధవలా ఉన్నాడు— పొమ్మను. నువ్వు లోపలికి రా." ఓ స్థూలకాయురాలైన ముప్పై ఏళ్ల స్త్రీ పోలిగాడి వైపు కొరకొర చూస్తూ కూతుర్ని రమ్మని చెప్పి లోపలికి వెళ్లింది.

నిమ్మీ తల్లి పిలుపుకి లోపలికి పరుగెత్తింది. కుక్క మాత్రం గుర్రు మంటూ పోలాయి వైపు చూసి వెళ్లిపోయింది. 'ఈ పిల్ల పేరేంటీ— నిమ్మీనా. . . అంటే నిమ్మకాయా. . . ఏందో. . . ఈళ్ల గొప్పోళ్లు.'

చింపిరి తల గోక్కుంటూ అర్ధ గంట నిలుచున్నా నిమ్మీ బయటికి రాలేదు. పోలాయికి కాళ్ళు లాగటం మొదలెట్టాయి.

మళ్లీ కడుపులో ఆకలి విజృంభించింది. కాళ్లీడ్చుకుంటూ ఇల్లు చేరాడు. తను చూసిందంతా తల్లితో చెప్పి ముంతెడు గంజి తాగేసి పడుకున్నాడు. ఎంతసేపటికీ నిద్ర రావటం లేదు.

చాలా రాత్రి గడిచిన తరవాత నిద్ర పట్టిందే కానీ, ఆ నిద్రలో చిత్రవిచిత్రమైన కలలు వచ్చాయి.

ఆ మేడలో ఆ మెల్లకన్ను పిల్లతో బాటు మంచి బట్ట లేసుకుని పూవుల తోటలో ఆడుకుంటున్నట్లు, తను బంతి విసురుగా వేస్తే ఆ గుర్రంలాంటి కుక్క పరుగెత్తి వెళ్లి బంతి నోటితో కరిచి పట్టుకుని తన కిచ్చినట్లు, అంతలో ఆ లావుపాటి ఆవిడ పళ్లెంలో రకరకాల తీపి పిండివంటలు తెచ్చి ఇద్దరికీ పెట్టినట్లు, అవి తిన్నన్ని తిని ఇంక అక్కరలేదని విసిరి కుక్కకి పారేస్తూ పగలబడి నవ్వుతున్నట్లు— ఏమిటేమిటోగా వచ్చింది కల.

చిరుగుల బొంత కాళ్లవరకూ చాంత చల్లటి గాలి విసురుకి చలేసి కాళ్ళు ముడుచుకుంటూ ఉంటే కమ్మటి కల

చెదిరిపోయి మెలకువ వచ్చేసింది. ఇంక నిద్ర రాలేదు. ఆ కల మళ్లీ వస్తే ఎంత బాగుండునూ అనిపిస్తూంది. అయినా మళ్లీ ఆ కల రానేలేదు పోలిగాడికి.

* * *

ప్రతిరోజూ పసుపురంగు మేడ దగ్గరికి వెళ్లటం అలవాటయింది పోలిగాడికి. సాయంకాలం నిమ్మీ గేటు తీసుకుని కుక్కని వెంటబెట్టుకుని షికారొస్తుంది. దాని మెడలో గొలుసు సుతారంగా పట్టుకుని తన కిష్టమైతే పోలిగాడితో కబుర్లు చెపుతుంది. లేకుంటే అసలు వాడిని ఎరగనట్లు ముఖం తిప్పేస్తుంది.

"బుల్లెమ్మా" అంటూ తనే పలకరిస్తాడు.

"ఏయ్, ఏమి టా పిలవటం. . . బుల్లెమ్మా. . . లిల్లిమ్మా అంటూ? ఫో!"


చీదరించేస్తుంది నిమ్మీ. ఆ పిల్ల అలా అన్న రోజు దుఃఖం కట్టలు తెంచుకుంటుంది పోలిగాడికి. నిమ్మీ కుక్కతో బంతి వేస్తూ సరదాగా ఆటలాడుతూంటే, 'ఛీ, ఎదవ జలమ! ఆ కుక్కనై పుట్టానుగాదు' అనుకుంటాడు తనలో తను. కుక్క వంక కోపంగా చూస్తాడు. అది మరీ గుర్రుమంటూ చూస్తుంది.

"నీతో మాట్లాడను. . . ఫో అవతలికి" అంది నిర్మల, స్వెట్టర్ని సర్దుకుంటూ. పోనీలే అని పౌరుషం వచ్చి ఇంటి కొచ్చేసినా మరునాటి రోజు వెళ్లకుండా మానలేదు పోలాయి.

ఆదివారం. నిమ్మీ గేటు ముందున్న పచ్చగడ్డిమీద కుక్కతో ఆడుతూ ఒక్కో చాకొలెట్టూ దూరంగా విసిరేస్తూంటే, కుక్క పిల్ల పరుగున వెళ్లి తినేసి మరోటి వెయ్యి అన్నట్లు చూస్తూంది తన చిన్న యజమాని వైపు.

ఆ రంగుకాయితంలోది తింటే ఎలా ఉంటుందో పోలిగాడి ఊహ కందటం లేదు. అలా చూసి చూసి ఇంటి కొచ్చేశాడు.

తండ్రి గుడిసె బయట కుక్కిమంచంలో కూర్చుని బీడి వెలిగించుకుంటూన్నప్పుడు తన సందేహం బయటపెట్టాడు. వీరన్న కొడుకు అడిగేది ఏమిటో మొదట అర్థం కాకున్నా తరవాత అర్థం చేసుకుని, "ఓరి. . . అదంటరా? ఆ రంగుకాయితాల్లో చుట్టుండేదాన్ని చాకొలెట్టు అంటార్రా. తియ్యగా ఉంటా యంట. నే నెప్పుడూ తినలేదు గానీ, మన కెందుకురా బాగెమంతుల యవ్వారాలా ఆలాంటి వాటి జోలికి పోమాకు



స్వర్గానికి నిచ్చెనలు ఫోటో— ఎస్. బి. తకల్కర్ (కొల్హాపూర్)

. . . పడుకో" అని కళ్లు మూసుకున్నాడు వీరన్న.

అక్కడే గోనెపట్టా పరుచుకుని నడుకున్న రంగి—"మావా, నీ వా చాకలట్టు తిన్నావేంటి—తియ్యగుంటదో, కారంగుంటదో చెప్తున్నావు!" అంది.

"మావా, నీ నా చాకలట్టు తిన్నావేంటి—తియ్యగుంటదా, కారంగుంటదో చెప్తున్నావు!" అంది.

"ఆఁ ఆఁ పెళ్లప్పుడు మీ ఆయ్యోట్టిండుగా. మరి రుసి తెల్వదేంటి?"

వీరన్న అలా అనేసరికి రంగికి చిర్రెత్తుకొచ్చింది.

"నీ వేనాడు సూటిగా మాటాడావు గనక! ఎప్పుడూ గింతే — నా జలమ కింతే." మూతి మూడు వంకర్లు తిప్పింది రంగి.

"అద్సరేగానీ, రంగీ, మనోడిని నదివిపిద్దామే. ఈడి అదురుట్టం మంచి దని ఆనాడు సింక జోసెం సెప్పినాడు గందా? అందుకే బడ్లో కంపిద్దాం. ఏరా, పోలిగా! రేపు సిలేటూ, బలపంకోపీ తెత్తాగానీ బడ్లోకి పోతావా?"

"ఓ. . ." చాటంత ముఖం చేసుకున్నాడు పోలిగాడు.

"ఆఁ మన ఇంటా వంటా లేదీ సదుకు. సదికి మన క్కూడెడతాడా? ఏం వద్దు. నీతో కూలిపనికి లాక్కెల్లు. ఆ సదుకు లన్నీ గొప్పోళ్లకి గానీ, మన కెందుకు?"

"నీ అపశకునం తగులడ. ఒక్కగా నొక్క బిడ్డ. గింత కడుపునిండా కూడు దొరికే పని సూపియ్యాలనే బుద్దే లేదేమే! నీకూ, నాకూలాగా ఈడు ఎంగిలి మెతుకులూ, గంజినీళ్లూ తాక్కూడదు. ఇదిగో, చెప్తన్నా ఇనుకో—ఈ జబ్బలో శకితి బగమంతు డిచ్చినంతదంకా సంపాదిత్తానే. నా కొడుక్కి సదువు సెప్పిత్తానే. ఏయ్ . . . తెలుసా? నా పోలిగాడు సూటూ బూటూ ఏసుకుని పంతులుద్దోగం సేస్తాడే."

కొడుకు భవిష్యత్తులోకి తొంగి చూస్తూ తను ఇంకా కష్టపడి నాలుగు రాళ్లు వెనకేసి చదివించాలని ఆలోచనల పైన ఆలోచనలు చేస్తూన్నాడు వీరన్న.

"నాయనా! ఈ సిరుగు లాగు ఏసుకుని బడ్లో కెడితే నవ్వుతారే!" తండ్రి మెడ వాటేసుకుని గారాబం పోతూన్నాడు పోలిగాడు.

"రేపే లాగూ చొక్కా, పలకా బలపం-అన్నీ కొత్తవి తెత్తాలేరా. నీ కెందుకూ, నే సున్నాగా? పడుకో" అంటూ తనూ నిద్రలోకి జారిపోయాడు.

"ఆఁ ఈ మొగమే! అన్నీ కొత్తవి తెచ్చేత్తాడంట. మింగేందుకు మెతుకు లేదు మీసానికి సాంపెంగ నూనెంట. అట్టాగుంది బతుకు. ఇయాల గంజి గ్గతి లేదు. రేపు ఎక్కడ కష్టం యేసి తెత్తావు. . ."

రంగి గొణుక్కుంటూనే పత్తిగిలి పడుకుంది. పోలాయికి నిద్ర రావటం లేదు. కుక్కిమంచంలో తండ్రి పక్క ఇరుగ్గా పడుకుని ఆకాశంలోకి చూస్తున్నాడు. చందమామలోని పేదరాశి పెద్దమ్మ నూలు వడుకుతూన్నట్లు కనిపిస్తూంది వాడి కళ్లకి. నక్షత్రాలన్నీ నిమ్మీ చేతిలోని ఉలిపిరి కాయితంలోని చాకొలెట్ల మాదిరిగా మెరుస్తూన్నాయి. "పేదరాశి పెద్దమ్మా! నాకో చాకొలెట్టు ఇవ్వవా" అంటూ కలవరిస్తూన్నాడు మగత నిద్రలోకి జారిపోయి.

* * *

తెల్లవారింది. మామూలుగా ఆటలికి పోతూన్న కొడుకుని "ఎక్కడికీ పోమాకరా. మీ అయ్య జల్దీ వస్తాన్నడూ" అంది రంగి.

"అంతలోకే వత్తాన్లేవే" అంటూ పచ్చమేడ దగ్గరికి పరుగు తీశాడు.

నిమ్మీ చేతిలో చాకొలెట్లు విసిరేస్తూంటే కుక్క పరుగున వెళ్లి తినేస్తూంది. ఈ ఆట అంటే నిమ్మీకి తగని ఇష్టం.

హుషారుగా చప్పట్లు కొడుతూ నవ్వుతూంది నిమ్మీ. ఇదంతాచూస్తూన్న పోలిగాడి నోట్లో నీరూరుతూంది. పెదిమలు తడుపుకుంటూ ఆశగా చూస్తూన్నాడు. నిమ్మీ వేసే ప్రతి చాకొలెట్టూ తనే పరుగున వెళ్లి అందుకుని పరపరా తినేస్తున్నట్టుగా భావించుకుంటూన్నా, తృప్తి కలగటం లేదు ఈ వేళ. ఒక్కటి ఎలాగైనా సరే తినాలనే కోరిక వాడిని నిలవనీయటం లేదు. ఆ కోరిక పెరిగి పెరిగి పెద్దదై పోతూంది. ఒక పక్క తన బ్రతుకు ఆ కుక్క కంటే హీనంగా ఉన్నందుకు ఉక్రోషం వచ్చేస్తూంది. 'ఛీ ఎదవ బతుకు. . . కుక్కగా పుట్టినా బాగుండి పోను!' నిట్టూర్చాడు.

నిమ్మీ చేతిలో ఉన్న చాకొలెట్ల డబ్బా ఖాళీ అయిపోతూంది. మహా ఉంటే

రెండో మూడో మిగిలాయేమో? పోలిగాడి మనస్సులో తొందరెక్కువై పోయింది.

"బుల్లెమ్మా, నాకో పెట్టవా?" నోరు తెరిచి అడగలేక అడగలేక అడిగాడు.

"అబ్బా, ఆశే. . ." మూతి తిప్పింది నిమ్మి.

"ఒక్కటంటే ఒక్కటి శాన." అది తినాలనే అభిలాషని వదులుకోలేక, అభిమానాన్ని చంపుకుని అన్నాడు.

"మనుషులకంటే కుక్కకే విశ్వాసం ఎక్కువట. మీ రంతా దొంగవెధవలు. అందుకే పెట్టకూడదు. మా అమ్మ చెప్పింది."

పోలిగాడి ముఖం నయాపైసంత అయింది. 'మీ రంతా దొంగవెధవలు' అన్న మాటకి వాడి కళ్లలో నీళ్లు తిరిగాయి. 'నే నేం దొంగాడిని కాను. అట్టా అయుంటే నీ చేతిలో డబ్బా ఒక్క దెబ్బన లాక్కు పారిపోయుండే వోడిని. కానీ, మా అమ్మా, నాన్నా ఊరుకోరు. దొంగబతుక్కంటే సావటం మేలంటది మా అమ్మ. . . పోనీలే. నా కేం వద్దు. . . ఎంచక్కా మా అమ్మ ముంతెడు గంజి పోసి ఉల్లిపాయి కొరుక్కోటాని కెడతంది. అదే బాగుంటది చాకొలెట్టుకంటే. పో. . . నీ దోస్తీ కటావు.'

చరచరా నాలుగడుగులు వేశాడు ఇంటికి వెళ్లిపోవటానికి.

అలా వెళ్లిపోయే పోలిగాడిని చూస్తుంటే బలే గర్వంగా ఉంది నిమ్మికి. ఇంకా,ఇంకా ఏడిపించి వినోదించాలనిపించి, "ఒరే, పోలిగా! ఇంద, చాకొలెట్టు ఇస్తా రా" అని బిగ్గరగా కేక పెట్టింది.

పోలిగాడు వెనక్కి తిరిగాడే గానీ, నిమ్మి నిజంగా అది ఇస్తుందని నమ్మకం లేదు. నిర్లక్ష్యంగా చూశాడు.

"నిజంగా ఇస్తాను, రా."

వాడి కళ్లు తళతళ లాడుతూండగా ఒక్క పరుగున వచ్చేశాడు. చెయ్యి చాచాడు.

"ఆఁ. . . ఆశ. ఇలా క్కాదు. నేనో పందెం వేస్తాను— నీకూ, మా జిన్నీకీ. ఇద్దరిలో ఎవరు గెలిస్తే వాళ్లకి ఈ చాకొలెట్టు."

పోలిగాడికి గెలవలేనేమో అని మొదట బాధ వేసినా తరవాత ధైర్యం తెచ్చుకున్నాడు. ఈ కుక్కే కాదు, ఈ ప్రపంచం అంతా ఏకమై వచ్చినా అందర్నీ ఓడించి పారేసి ఆ చాకొలెట్టుని పరపరా నమిలి మింగేస్తాను—అన్నట్లు చూస్తూ, 'అట్టాగే' అన్నట్లు తల ఊపాడు.

నిమ్మి జిన్నీకి అర్థమయేలా చెప్పి "వన్, టూ, త్రీ" అంటూ రెండు సార్లు చెయ్యి విసిరింది. పోలిగాడూ, జిన్నీ పరుగు తీశారు.

నిమ్మి పగలబడి నవ్వుతూ "నే నసలు వెయ్యందే" అంది.

"ఇదిగో, పోలిగా, జిన్నీ. . . ఈ సారి తప్పకుండా వేస్తా. రెడీగా ఉండండి."

పోలాయి ఓ కాలు ముందుకు పెట్టి పరుగు తీసేందుకు సిద్ధంగా నిలుచున్నాడు. జిన్నీ తోకఆడించి తన యజమానురాలిని కుతూహలంగా చూసింది. "పోలిగా, ఆ చాకొలెట్టు తీసుకు నా దగ్గరికి పరుగున రావాలి. వన్. . . టూ. . . త్రీ. తిరిగి నా దగ్గరికి రావాలి." మరోసారి గుర్తు చేసింది. పోలాయి బాణంలా దూసుకెళ్లాడు. కుక్కఅంతకంటే వేగంగా పరుగు తీసింది. కానీ, చాకొలెట్ పోలిగాడికే చిక్కింది. జిన్నీకి కోపం ముంచు కొచ్చి పోలిగాడిమీద పడబోతే, భయపడి పోయి రోడ్డుకి అడ్డ దిడ్డంగా పరుగు తీస్తూ నిమ్మి వైపు వస్తూండగా స్పీడుగా వచ్చిన ఓ చిన్న కారు పోలిగాడి మీదనించి సర్రున దూసుకుని పది గజాల ముందు కెళ్లి ఆగిపోయింది. నిర్మల తండ్రి వెంకట్రావు ఖంగారుగా కారు దిగాడు. జిన్నీ తోకఆడిస్తూ యజమాని దగ్గరికి పరుగెత్తు కొచ్చింది.

కారులో వెంకట్రావు స్నేహితుడు మాధవరావు కిందికి దిగుతూ, "వెంకట్రావ్, ఎంత పని చేశావోయ్! నీ పెంపుడుకుక్కని రక్షించటం కోసం కుర్రాడిని. . . కుర్రాడిని. . . బలి పెట్టావా!" అని ఇంకేం చెప్పటానికి నోరు రాక వెనక్కి వచ్చి చూసేసరికి పోలిగాడు కొన ఊపిరితో రక్తం మడుగులో కొట్టుకుని మరు క్షణంలో ప్రాణం వదిలేశాడు. ప్రాణం పోయినా, కుడిచేతి పిడికిలిలో చాకొలెట్టు సురక్షితంగా బిగుసుకునే ఉంది.

నిమ్మి "కీ" మంటూ వెర్రికేక పెట్టి కొయ్యలా బిగుసుకుపోయింది. వెంకట్రావు ఏం చేయాలా అని ఆలోచిస్తూ నిలుచున్నాడు.

నిప్పులాంటి మనిషి మాధవరావే ఆ కారులో లేకుండా ఉంటే అంతా గప్ చిప్‌గా జరిగిపోయేది. కానీ, కాలం బాగా లేదు. అందుకే పోలిగాడి తల్లితండ్రులని కలుసుకోక తప్పలేదు.

పసుపు రాచిన పలకా, బలపంకోపీతే కాక, రాత్రంతా కొడుకు కలవరించిన చాకొలెట్లు రెండూ పట్టుకుని ఇంటికి వచ్చిన వీరన్న, జరిగింది విని నిలువునా కూలిపోయాడు. రంగి గోలుగోలు మంటూంది. ఇరుగూ పొరుగూ వ్యవహారం ఫైసలు చేస్తూ బేరాలు ఆడుతూన్నారు.

"రెండొందలు ఇవిగో. . . పోయినోడెలాగూ రాడుగందా?" నోట్లకట్ట అందించాడు మధ్యవర్తి.

"ఎందు కిది? ఎందుకూ అంట. . ." దుఃఖం మింగుకుని కోపంతో బుసలు కొడుతూ అన్నాడు వీరన్న.

"జరిగిపోయింది మరిచిపో. ఏం చేసినా పోయినోడు రాడు. పోలీసులూ గొడవా ఎందుకూ మాఫీ చేసుకోవటానికి? పోనీ, మరో వంద తీసుకో." మధ్యవర్తి మాట వింటూనే వెంకట్రావు మరో పది పది రూపాయల కాయితాలు మధ్యవర్తి గుప్పెట్లో కుక్కాడు.

వీరన్న కళ్లు రక్తం చిమ్మేట్టున్నాయి.

"ఇదిగో, ఓ బాగ్యవంతుడా. . . నీ కళ్లు పసర్లు దట్టి నీ కుక్క బతుక్కోసం నా బిడ్డ పాణం బలెట్టావు. నేను నిన్నూ, నీ కూతుర్నీ ఒక్కేటుకి చంపగలను. కానీ, నా బిడ్డ రాడే. . . అట్టా ఒచ్చేట్టుంటే నిన్నేగాదు, వంద మందిని నరికి పోగు లెట్టగలను. ఏం లాబం? నా పోలిగాడు నాకు రాడు. పోయినోడు పోగా, నీ పాపం డబ్బు నా కెందుకు? వద్దు. ఇది తీసుకెళ్లి ఇంకా బాగ్యవంతుడివై ఇంకా నాలుగు కార్లు కొనుక్కో. ఇంకో పది కుక్కలని పెంచు. నా బిడ్డల్లాంటోళ్లని ఇంకా పది మందిని చంపుతూ 'పాపీ చిరాయువు' అన్నట్లుండు. పో. నా కళ్లముందు నించి పో. . . అయినా, ఇంత పేదింటో పుట్టి గంజినీళ్లతో తురుతిబడక ఆశగా నీ కూతురు తినే చాకొలెట్టు కావాలనుకోవటం నా బిడ్డది తప్పు. మా బతుకు లెంత, మే మెంత! మా పేదోళ్ల బతుకులకంటే నీ ఇల్లు కావలా కాసే కుక్క బతుకు నయం. బాబూ, ఎల్లండి. నా బిడ్డని చంపి నీ విచ్చిన ఈ డబ్బుతో నే నాకలి తీరుచుకోనా? ధూత్. అంతకంటే ఉపాసాలతో సస్తా గానీ, ఆ పాపం డబ్బు నా కొద్దు, బాబూ, వద్దు. . ."

వీరన్న మాటలు ఆ బస్తీలో వాళ్ల కెవరికీ నచ్చలేదు. 'సందు దొరికింది. రెండొంద లేంటి రెండేలన్నా కక్కించచ్చు. కానీ, ఈ వీర న్నదేం ఇనటం లేదే. అయినా, మా కెందుకు' అనుకుంటూ ఎవ రిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు.

గుడిసెలోని గుడ్డి దీపం గప్పుమని ఆరిపోయింది.

పచ్చమేడమీద బెడ్‌రూమ్ నీలం బల్బు వెలుతురులో దోమతెర మంచం మీద డన్‌లప్ పరుపూ, మెత్తని దిండ్లూ పైన పడుకున్న నిమ్మి జ్వర తీవ్రతతో ఉలిక్కి పడి "పోలిగా. . . చాక్లెట్టు" అంటూ కలవరిస్తూంది.

"ఓ కల్యాణ చక్రవర్తీ! నిలువుదోపిడీ ఇస్తాను. నీ కొండ కొస్తాను. నా తల్లిని చల్లగా చూడు" అని మనఃస్ఫూర్తిగా దణ్ణం పెడుతూ వెంకటేశ్వరుడికి లంచం ఎర జూపుతూంది ఆ భాగ్యవంతురాలు, నిమ్మి తల్లి.

వెంకట్రావుకి వీరన్న అన్న మాటలు ఈటెల్లా తగిలి బాధ కలిగిస్తున్నాయి. ఇటూ అటూ పచార్లు చేస్తూ ఆలోచిస్తున్నాడు.

పదేళ్ల క్రితం తన తమ్ముడు కారు ప్రమాదంలో మరణిస్తే-కారు యజమాని తప్పు లేకున్నా, బెదిరించి కోర్టూ, పోలీసులూ అంటూ గుర్తు చేసి అయిదు వేలు గుంజి ఆ డబ్బుతో వ్యాపారం మొదలెట్టి, అలా అలా లాభాలు తీస్తూ ఈ రోజుకి రెండు లక్షలకి అధిపతి అయాడు. అయినా, ధన దాహం తగ్గలేదు. మనశ్శాంతి లేదు.

కూటికి లేకున్నా, వీరన్న త నిచ్చే డబ్బు ఎందుకు తిరస్కరించాడు? అనేది వెంకట్రావుకి అర్థంకాని ప్రశ్న. ★

---

## సంభాషణ చాతురి

సంభాషణా చాతుర్యం అవసరమైన సమయంలో అవసరమైన మాట చెప్పడమే కాదు. ఉద్రేకంలో చెప్పకూడని మాట చెప్పకుండా నిగ్రహించుకోవడం.

—డొరొతీ నెవిల్

## ఓర్మి

కబుర్లు చెప్పాలంటే ఆడవారికే చెప్పాలి. అవతలి వారు శ్రద్ధగా వినకపోతే, చెప్పేవారికి ఉత్సాహం ఉండదు. ఎంత చెత్త కబుర్లు అయినా, ఆడవారు మహా శ్రద్ధగా వినగలరు.

—హూమ్స్

## స్త్రీ హృదయం

ఆడవారిని మించిన పుస్తకాలు, కళలు, అకాడెమీలు లేవు. ఆడవారి హృదయాన్ని చదవగలిగితే, అన్ని పుస్తకాలు చదివినట్లే; అన్ని కళలు సాధించినట్లే.

—షేక్స్‌పియర్